ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

ఆదిభట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాదర్గుల్‌లోని సెయింట్ మ్యాథ్యూస్ ప్రైవేటు పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మనీష్.. అక్కడే చదువుతున్న టెన్త్ విద్యార్థిని వెంటపడుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆదిభట్ల పీఎస్‌లో ఫిర్యాదు అందింది. దీంతో మనీష్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అదనపు కలెక్టర్ పోస్టు భర్తీ చేయరా?



- గాడిలో పడని 'రెవెన్యూ'
- ఎక్కడ ఫైళ్లు అక్కడే
- ఇన్‌చార్జి వద్ద వేల సంఖ్యలో పెండింగ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పోస్టు ఆరు నెలలుగా ఖాళీగానే ఉంది. ఇంతకు ముందెన్నడూ అదనపు కలెక్టర్ పోస్టు ఇన్నాళ్లు భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచిన దాఖలాలు లేవు. గత ఆగస్టు నెలలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న భూపాల్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. భూపాల్‌రెడ్డి సస్పెన్షన్ తరువాత ఎవరినీ ఇంత వరకు ఈ పోస్టులో నియమించలేదు. కొత్తవారికి పోస్టుకు ఇవ్వకుండా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న ప్రతిమాసింగ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆమె స్థానిక సంస్థలు, రెవెన్యూ బాధ్యతలు చూస్తున్నారు. దీంతో రెవెన్యూ సమస్యలు భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. కింది స్థాయి నుంచి క్లియరై వచ్చిన వేలాది ఫైళ్లు అదనపు కలెక్టర్ పేషీలో కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణంగా రెవెన్యూ చూసే అదనపు కలెక్టర్ వద్ద ఫైళ్లు ఎక్కువ సంఖ్యలోనే పెండింగ్‌లో ఉంటాయి. అదనపు సమాచారం కోరుతూ కింది స్థాయి అధికారులకు మళ్లీ లేఖలు పంపుతుంటారు. దీంతో ఇక్కడ ఫైళ్ల పెండింగ్ శాతం ఎక్కువగానే ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ ఉన్న ఫైళ్లు వేలాదిగా పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఇందులో చాలావరకు కిందిస్థాయిలో క్లియరైన ఫైళ్లే ఉన్నాయి. పెండింగ్ ఫైళ్ల విషయంలో సత్వర నిర్ణయం తీసుకుంటే బాధితులు ప్రయోజనకరంగా ఉంటుంది. ఒకవేళ తమకు ఇక్కడ న్యాయం జరగకపోయినా

మిగతా 8వ పేజీలో...

గతమెంతో ఘనం

కీలకమైన రంగారెడ్డిజిల్లాలో పని చేసే అవకాశం దక్కడం ఐఏఎస్‌లు అదృష్టంగా భావిస్తుంటారు. అందుకే గతంలో ఉమ్మడి జిల్లాలో జాయింట్ కలెక్టర్/అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఎంతో మంది నిక్కచ్చిగా పనిచేయడమే కాకుండా సాధారణ ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనేక మంది జటిలమైన అనేక రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. అత్యున్నత న్యాయస్థానాల్లో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించి రూ.వేల కోట్ల విలువైన భూములను కాపాడారు. అలాంటి అధికారులు తరువాత కాలంలో కీలక స్థాయి పదవులు పొందారు. గతంలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విజయానంద్ ఇప్పుడు ఏపీ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. అలాగే ఇక్కడ గతంలో జాయింట్ కలెక్టర్లుగా పనిచేసిన శేషాద్రి, రవిచంద్ర ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కాలంలో వీరంతా కూడా ఎంత సమయమైనా తమ వద్దకు వచ్చే బాధితులందరినీ కలిసి ఓపిగ్గా వారి గోడు విని సత్వర న్యాయం చేసేందుకు ప్రయత్నించి సామాన్యుల మన్ననలను పొందారు. ఎంత ఒత్తిడి ఉన్నా కూడా తమ విధులను సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు సంపాదించారు.

శంభో శివ శంభో

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- ఆలయాల్లో బారులుదీరిన భక్తులు
- ఒక్కపొద్దు, జాగారాలతో శివుడికి పూజలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పరమశివుని దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో బారులుదీరారు. భక్తిశ్రద్ధలతో శివపార్వతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి వేడుకల నేపథ్యంలో ఆలయాలు విద్యుత్‌కాంతులీనాయి. దేవాలయాలకు వచ్చేవారి కోసం నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పించారు. భక్తులు ఒక్కపొద్దు, జాగారం ఉండి నీలకంఠుడి పూజలో లీనమైపోయారు. మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వరాలయం, శంకర్‌పల్లి మండలం చందిప్ప మరకత శివాలయం, ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వర స్వామి దేవాలయం, చేవెళ్ల మండల కేంద్రంలోని బాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శివాలయం, కొనగట్టు మల్లికార్జునస్వామి దేవాలయం, బ్రహ్మగిరి క్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తలకొండపల్లి మండలం చెన్నారం మల్లప్ప గుట్టపై శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.



ఆమనగల్లు : మల్లికార్జున స్వామీ మమ్ము దీవించయ్యా...



కీసరలో యువతి పూజలు



కీసర గుట్టలో భక్తజన సందోహం





షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో



మొయినాబాద్ రూరల్ : చిలుకూరులో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఇబ్రహీంపట్నంలోని శివాలయ ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మహేశ్వరం రాజరాజేశ్వరాలయంలో భక్తులతో కలిసి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అనంతగిరికి అందాల భామలు!

- మే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలు
- తెలంగాణ ఊటీ సౌందర్యాన్ని ఆస్వాదించనున్న సుందరీమణులు



వికారాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను వివిధ దేశాల సుందరీమణులు సందర్శించనున్నారు. పచ్చని చెట్లు.. చుట్టూ ఎత్తయిన కొండలు, లోతైన వంపులతో చూడగానే మనసు మైమరిచిపోయే ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండల అందాలను వారు ఆస్వాదించనున్నారు. మే నెలలో హైదరాబాద్ వేదికగా జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు వివిధ దేశాల నుంచి సుందరీమణులు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. ప్రపంచం నలుమూలల నుంచి సుందరీమణులు పాల్గొనే మిస్ వరల్డ్ పోటీల ద్వారా విభిన్న రంగాల్లో రాష్ట్రానికి ఉన్న ప్రాముఖ్యానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకంగా గుర్తింపు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పోటీలు జరిగే రోజులు మినహాయించి మిగతా రోజుల్లో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులతో పాటు ఆయా దేశాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులను రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు తీసుకు వెళ్లి చూపించాలని భావిస్తున్నారు.

అందాలను ఆస్వాదించేలా..

పర్యావరణ పర్యాటక కేంద్రం (ఎకో టూరిజం)గా అనంతగిరిని అభివృద్ధి పరచాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులతో పాటు ఆయా దేశాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులను అనంతగిరి కొండలకు తీసుకువచ్చి వారు ఇక్కడి పర్యావరణ అందాలను ఆస్వాదించే అవకాశం కల్పించనున్నారు. సుందరీమణుల పర్యటన అనంతగిరి మరింత అభివద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడుతుందన్న ఆశాభావంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ పోటీల్లో 140 దేశాల నుంచి సుందరీమణులు పాల్గొననున్నారు. అనంతగిరి వంటి ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా ప్రపంచ దేశాల గుర్తింపు లభించేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మంగా భావించే మిస్ వరల్డ్ పోటీలను ఓ అవకాశంగా మలుచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ దేశాల నుంచి పాల్గొనే ఈ వేడుకను పర్యాటకాభివృద్ధికి వేదికగా మార్చుకునే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి పోటీలు జరిగే ప్రాంతాలతో పాటు పోటీల్లో పాల్గొనే సుందరీమణుల పర్యటించే ప్రాంతాలు త్వరలో ఖరారు కానున్నాయి. అనంతగిరి కొండలను సందర్శించి ఇక్కడి ప్రకృతి అందాలు ఆస్వాదించడం వరకే పరిమితం చేస్తారా? లేక మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి ఏదైనా ఒక థీమ్‌తో ఈవెంట్ నిర్వహణకు అనంతగిరి కొండలు వేదికకానున్నాయా అనేది గురువారం నాటికి స్పష్టత రానుంది. ప్రపంచ సుందరీమణుల సందర్శనతో అనంతగిరి కొండలు మరోసారి విస్తృత ప్రచారంలోకి రానున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వానికి

ప్రజలే కొండంత బలం

- రాష్ట్రాభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించాలి
- కల్వకుర్తి అభివృద్ధికి తోడ్పాటునందిస్తా
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ఆమనగల్లు , ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశీర్వాదమే కాంగ్రెస్ ప్రభుత్వానికి కొండంత బలమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా బాసటగా నిలువాలని ఆయన కోరారు. బుధవారం తలకొండపల్లి మండలం మల్లప్పగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని స్పీకర్ సందర్శించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డిలతో కలిసి ఆలయంలో జరిగిన శివపార్వతుల కల్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, అధ్యక్షుడు మాకం పాండయ్య, చైర్మన్ ఏమిరెడ్డి కౌసల్య, నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, ఏమిరెడ్డి శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, అర్చకుడు గోపాలకృష్ణశర్మలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారెంటీల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.



కల్యాణ వేడుకలో స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తనవంతు తోడ్పాటునందిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. మల్లప్ప గుట్ట ఆలయ మరింత అభివృద్ధికి, భక్తుల సదుపాయాల కల్పన గురించి సీఎం రేవంత్ దృష్టికి తీసుకుపోతానని ప్రసాద్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి పర్యాటక శాఖ ద్వారా రూ.5 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మల్లప్ప మల్లికార్జున స్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రముఖ పుణ్యక్షేత్రంగా మారుస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ దేవాలయాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

తలకొండపల్లి : శివరాత్రి నేపథ్యంలో మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆది దేవుడి కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పూజారి గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఏమిరెడ్డి ప్రియాంకపాండు రంగారెడ్డి, ఏమిరెడ్డి గౌరిశ్రీనివాస్‌రెడ్డి దంపతులు కల్యాణ తంతు జరిపించారు.




దుర్గామాత ఆలయ హుండీ చోరీ



సీసీ ఫుటేజీలో దుండగుడు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మర్రిపల్లిగూడలోని శ్రీ దుర్గామాత ఆలయంలో గుర్తుతెలియని దుండగుడు హుండీ ఎత్తుకెళ్లాడు. సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద హుండీని పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లాడు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పరిసరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దౌల్తాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు. దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్‌లో ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన ఆనంద్ ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.





జాతీయ రహదారిపై.. ఆక్రమణల తిష్ఠ

- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- రహదారిని అద్దెకిస్తున్న దుకాణాదారులు


ఆమనగల్లులో హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై దుకాణాల ముందు చిరు వ్యాపారాలు ఇలా

ఆమనగల్లు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి చిరు వ్యాపారుల ఆక్రమణలతో నానాటికీ ఇరుగ్గా మారుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. చిరు వ్యాపారుల ఆక్రమణలను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో ఇబ్బందిగా మారింది. దీనికి తోడు చిరు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. దీంతో రాకపోకలు, పాదచరులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తరచూ చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బస్టాండ్ స్కూల్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు సమీపంలో కొన్నిసార్లు చిరువ్యాపారులు, వాటి ముందు కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌తో బస్సులు, పెద్ద వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరువ్యాపారులు రోజురోజుకూ రోడ్డుమీదికి వస్తున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసుల, మున్సిపాలిటీ అధికారుల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పండ్ల అమ్మకాలు, టీకొట్లు, తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర చిరువ్యాపార దుకాండ్లు హైవేపేనే నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే కొందరు దుకాణాల యజమానులు షాపుల ముందు ఉన్న రోడ్లను ఆక్రమించి టీకొట్లు, జ్యూస్ బండ్లకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదేదో వారి సొంత స్థలమైనట్టు దబాయించి మరీ కిరాయి వసూలు చేసుకుంటున్నారు. చిరు వ్యాపారుల నుంచి రోజుకు ఇంత మొత్తంగా తీసుకుంటూ ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గిరాకీని బట్టి రోజుకు రూ.300 నుంచి 600వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేస్తున్న కిరాయితో వారి దుకాణాలకు అద్దె చెల్లిస్తున్నారు. చిరు వ్యాపారుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్ అధికారులు, సివిల్ పోలీసులు స్పందించి జాతీయ రహదారిపై చిరువ్యాపారుల ఆక్రమణలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్డు

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

- భక్తులతో ఆలయాల కిటకిట
- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్ చౌడమ్మగుట్ట ఆలయం వద్ద శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే శంకర్ దంపతులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాలను పలు ఆలయాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకుని షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఒకే వేదికపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామి కల్యాణంతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరపారు. పట్టణంలోని చౌడమ్మ గుట్ట ఆలయం, ఈశ్వర్ కాలనీ ఆలయం, శివరుద్ర ఆంజనేయస్వామి ఆలయం, కాశీ వేద పాఠశాల ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, పట్టణ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు.


షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఒకే వేదికపై లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శివ పార్వతుల కల్యాణోత్సవం


షాద్‌నగర్ ఈశ్వర్‌కాలనీ ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం



నిరుపయోగంగా పశువుల నీటి తొట్లు


ఆలేడ్‌లో నీరు నిండని నీటి తొట్టి

దుద్యాల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకం కింద గతంలో గ్రామాల్లో ప్రధాన రోడ్ల పక్కన నీటి తొట్లను నిర్మించారు. ఎంతో కాలంగా వాటిల్లో నీరు నింపడం లేదు. కొన్ని గ్రామాల్లో తొట్లకు పగుళ్లు ఏర్పడి పగిలి పోయాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో నీటి సౌకర్యం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో పశువుల దాహార్తి తీరడం లేదు. బోర్ల నుంచి తొట్లకు నీటి సరఫరా చేయాల్సి ఉండగా నిర్వాహణ లేమితో లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన నీటి తొట్టెల వాడకం లేక నిరుపయోగంగా మారాయి. ఎండలు ప్రారంభమయ్యాయి. నీటి తొట్లలో నీటి సరఫరాతో వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. పశుసంవర్ధక, సంబంధిత శాఖల అధికారులు వీటిపై దృష్టి సారించాలంటున్నారు.

నీటి తొట్లకు మరమ్మతులు చేయిస్తాం

గ్రామాల్లో నీటి తొట్లకు మరమ్మతులు చేయిస్తాం. వేసవి ఎండలు ప్రారంభం కావడంతో నీటి తొట్లలో బోర్ల ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- కె.మహేశ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, దుద్యాల

కీసరగుట్ట క్షేత్రానికి ప్రత్యేక బస్సులు


- ఉదయం నుంచి రాత్రి వరకు 285 స్పెషల్ ఆపరేషన్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి కీసరగుట్టకు వెళ్లే భక్తుల కోసం గ్రేటర్ ఆర్టీసీ 285ప్రత్యేక బస్సులను నడిపింది. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, అమ్ముగూడ, ఉప్పల్‌ఎక్స్ రోడ్‌ల నుంచి ప్రత్యేక బస్సుల్లో భక్తులు కీసరగుట్టకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. కీసరగుట్టలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసిన అధికారులు ఆర్టీసీ బస్సుల్లో వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే సీబీఎస్ నుంచి మెదక్ జిల్లా ఏడుపాయలకు, పటాన్‌చెరువు నుంచి బీరంగూడ జాతరకు 155 బస్సులు నడిపారు.


బోనం అందుకో మల్లన్న సామీ..

చౌదరిగూడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం ముట్పూర్‌లో మల్లన్న బోనాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం మహిళలు బోనాలతో ర్యాలీగా తరలివచ్చి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎండ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు.


బోనాలు సమర్పిస్తున్న భక్తులు







ముక్కంటికి మొక్కు..

● భూకైలాస్ ఆలయంలో ఘనంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ● శివుడిని దర్శించుకున్న ప్రముఖులు


అంతారం భూకైలాస్ ఆలయంలో శివున్ని మొక్కుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం అంతారంలోని భూకైలాస్ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం మహాశివుడికి అభిషేకాలు, పూజలు, అలంకరణ చేశారు. స్వామివారి పల్లకిసేవ ఆలయం నుంచి తండాలోని పురవీధుల్లో తిరిగి ఆలయానికి చేరింది. ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్‌నాయక్ పల్లకి సేవలో పాల్గొన్నారు. గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి నైవేద్యాలు సమర్పించారు. నీటిమార్గంగుండా ముక్కంటిని దర్శించుకున్నారు. గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, శివుని పాటలతో తండా మార్మోగింది. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేర్వేరుగా ఆలయాన్ని సదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏటా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధారాసింగ్, ఉత్తంచంద్, పురుషోత్తంరావు, తహసీల్దార్ తారాసింగ్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెలీప్యాడ్‌లను పరిశీలించారు. టౌన్‌లు సంతోష్‌కుమార్, నగేష్‌లు జాతరలో అవాంఛనీయ సంఘటన జరుగకుండా చూసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో మహారాష్ట్ర మంత్రి

మహారాష్ట్ర నేల, నీటి సంరక్షణ శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ కుటుంబీకులతో కలిసి భూకైలాస్ ఆలయాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ స్వాగతం పలికారు. మంత్రి, కుటుంబీకులు జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ మహా శివలింగాన్ని చేరుకున్నారు. హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రితో వాసుపవార్ నివాసంలో కలిశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తన స్నేహితుడు శంకర్‌నాయక్ కోరిక మేరకే తాను భూకైలాస్ ఉత్సవాలకు వచ్చినట్లు చెప్పారు. నీటి మార్గంలో 12 జ్యోతిర్లింగాలను కలిసి దర్శించుకోవడంతో తన జన్మ ధన్యమైందన్నారు. మహారాష్ట్రలోని పావురా నగరంలో రూ.7.15కోట్లతో సేవాలాల్ మందిరాన్ని నిర్మించామన్నారు. తమకు రామారావు మహరాజ్ ఒక గురువుగా ఉండేవారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.


హోమంలో మహారాష్ట్ర మంత్రి సంజయ్ దంపతులు

హెలీకాప్టర్‌లో వచ్చిన మహారాష్ట్ర మంత్రి

● ఆసక్తిగా తిలకించిన స్థానికులు, భక్తులు

తాండూరు మండలం అంతారం భూకైలాస్ ఆలయం లో జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్ హెలీకాప్టర్‌లో వచ్చారు. భూకైలాస్ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు ప్రజలు, భక్తులు పెద్దఎత్తున చేరుకొని హెలీకాప్టర్ ల్యాండ్ అవడాన్ని ఆసక్తిగా తిలకించారు. అంతారం తండాలోని పదెకరాల విస్తీర్ణంలో రూ.కోట్లు వెచ్చించి భూకైలాస్ ఆలయాన్ని తండాకు చెందిన దివంగత సేవ్యానాయక్ వం శం జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆల్ ఇండియా బం జారా సంఘం ప్రతినిధులు వాసు పవార్‌నాయక్, శంకర్‌నాయక్ నిర్మించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిరూపాల ను భూకైలాస్ ఏర్పాటు చేశారు. ఇక్కడి 65 అడుగుల శివుడి విగ్రహం ప్రత్యేకం.


హెలీకాప్టర్ దిగుతున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్

తల్లీకొడుకు మృతిపై విచారణ ముమ్మరం

● పోలీసుల అదుపులో అనుమానితురాలు

బషీరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తల్లీ, కొడుకు మాల ఎల్లమ్మ, మొగులప్పల మృతిని బషీరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కాశీంపూర్‌లో ఎల్లమ్మ, మొగులప్ప మంగళవారం ఒకే రోజు ఉరేసుకున్నస్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. మృతులు ఆత్మహత్య చేసుకోలేదని బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. ఉద్రిక్తతల మధ్య డెడ్ బాడీలను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో రూరల్ సీఐ నగేష్ ఆధ్వర్యంలో ఎస్సై శంకర్, సిబ్బంది ఇద్దరి మృతిపై విచారణ ముమ్మరం చేశారు. వీరి మృతికి మొగులప్ప భార్య రేణుకే కారణమని, మృతుల సంబంధీకుల ఫిర్యాదుతో విచారణ అనంతరం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తల్లీకొడుకును ఎవరో చంపారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో రేణుక పాత్ర ఉందా?అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మొగులప్ప మర్మావయవాల నుంచి రక్తం కారడంతో హత్య చేసిండొచ్చని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో తేలుతుందని, ఈ కేసు విచారణ ముమ్మరం చేశామని పోలీసులు చెబుతున్నారు.


మృతుడు మొగులప్ప భార్య రేణుక

గ్రామ కంఠం భూమి కబ్జా

● కలెక్టర్ ఆదేశించినా చర్యలు తీసుకోని సిబ్బంది

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెద్ద తూప్రలో కె.కృష్ణయ్య అనే వ్యక్తి 500గజాల గ్రామ కంఠం భూమిని కబ్జా చేశాడని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశాడని గ్రామస్తులు ఈ నెల 22న జిల్లా పంచాయతీ అధికారికి, 24న కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. కాగా కబ్జా భూమిలో ఏమైనా పనులు చేపడితే వాటిని వెంటనే నిలిపివేయాలని మండల, పంచాతీయతీ సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా నేటికీ కింది స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోలేదని, ప్రహరీ నిర్మిస్తున్నారని పెద్దతూప్ర గ్రామస్తులు ఆరోపించారు. ఇదే అంశంపై గ్రామస్తుడు తేరుపల్లి రమేష్ ఆర్టీఏ యాక్ట్ కింద దరఖాస్తు చేసుకోగా ఇది గ్రామ కంఠం భూమి అని రికార్డులు ఇచ్చారు. కానీ అధికారులు మాత్రం భూమిని కబ్జా బారి నుంచి పరిరక్షించడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. ఈ కబ్జా వెనక ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హస్తం ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామ కంఠం భూమిని స్వాధీనం చేసుకోకుంటే ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోసం యత్నించగా అందుబాటులో లేరు.


గ్రామ కంఠంలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ

శివనామస్మరణతో మార్మోగిన రాజరాజేశ్వరాలయం

మహేశ్వరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలోని శివ గంగ రాజరాజేశ్వరాలయం మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శివనామస్మరణతో మార్మోగింది, స్వామి వారలకు రుద్రాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతి వంటి పూజలు చేశారు. ఉదయం 5గంటల నుంచి రాత్రి పొద్దు పోయే వరకు భక్తులు రాజరాజేశ్వరుడిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉపవాస దీక్షలు విరమణకు వేలాదిమంది వచ్చారు. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఐదు రోజులు కొనసాగే ఈ ఉత్సవాలకు మహేశ్వరం ప్రాంతంతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. అన్నదానం, తాగునీరు, టాయిలెట్లు, వైద్యం, పోలీసుల నిఘా వంటి సౌకర్యాలు కల్పించారు. ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కేఎల్లార్, నాయకులు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అందెల శ్రీరాములు, బొక్క నర్సింహారెడ్డి పూజలు చేశారు. డీసీపీ సునీతారెడ్డి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ చైర్మన్‌లు కూనయాదయ్య, కాకి ఈశ్వర్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, నవీన్, కుమార్, డైరెక్టర్లు ఎం.రాఖేష్, శంకర్, సాయులు, నరేష్, శ్రీశైలం, తిరుపతయ్య, సువర్ణ, వివిధ పార్టీల నాయకులు పూర్ణచంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జి.జంగయ్య, భిక్షపతి, యాదీష్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, కె.చందు, రాజు, ఎ.యాదయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, మల్లేష్, మైసయ్య, శ్రీకాంత్, ఈవో మురళీకృష్ణ, ప్రధానార్చకులు వీరేషం పాల్గొన్నారు.


మహేశ్వరంలో ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): ఉత్తర రామేశ్వరంగా పేరుపొందిన ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వర స్వామి శివనామ స్మరణతో మార్మోగింది. బుధవారం అర్ధరాత్రి దాటినా మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరారు. ఉదయమే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు ఆశీర్వదించారు. సాయంత్రం నుంచి భారీగా భక్తులు ఆలయానికి చేరుకొని పూజలానంతరం ఉపవాస దీక్షలు విరమించారు. పలు సేవాసంస్థలు భక్తుల తకు ఫలహారాలు అందించాయి. కోనేటి స్నానాల అనంతరం ఆలయంలోకి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందు వేసిన పందిళ్ల కింద సేదదీరారు. అలాగే ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దంపతులు శివలింగానికి పూజలు చేశారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. షాద్‌నగర్ నుంచి భక్తులు ఆల యానికి చేరుకునేందుకు ఆర్టీసీ నిరంతరం బస్సులు నడిపింది. వాసవీ క్లబ్ షాద్‌నగర్ సభ్యులు క్యూలైన్లలో ఉన్న భక్తులకు 25వేల వరకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. విధుల్లో ఉన్న వివిధ శాఖల సిబ్బందికి ఆలయం తరపున భోజన వసతి కల్పించారు.

పర్యాటకరంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కడ్తాల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల రాజేశ్‌రెడ్డి అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. మైసమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజ శాంతిస్థాపనకు దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. మైసమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తనవంతు తోడ్పాటునందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతూ, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు జవహర్‌లాల్ నాయక్, షాబుద్దీన్, బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, హన్మనాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.


మైసమ్మ పూజలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి తదితరులు

బుగ్గ ఆలయంలో స్పీకర్ పూజలు


వికారాబాద్ బుగ్గ ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

వికారాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, మల్లికార్జున ఆలయం, పార్వతీ పరమేశ్వరుల గుట్ట, ఆయా ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. బుగ్గ ఆలయంలో ఉదయం నుంచి పెద్దఎత్తున క్యూలో నిలబడి దర్శనం చేసుకున్నారు. సాయంత్రం ఉపవాస దీక్షలను విరమించారు. బుగ్గ ఆలయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు ఆలయం సమీపంలో అయోధ్య రామ మందిర ప్రసాదం, పండ్లను భక్తులకు పంపిణీ చేశారు.


మల్లికార్జునాలయంలో భక్తుల రద్దీ

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజల్లో భక్తులు, నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్రిపల్లి సత్య అంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు యాట గీతనర్సింహ, జోగు వీరయ్య, రాములు గౌడ్, అంజయ్యగౌడ్, నర్సింహాగౌడ్, జంగయ్య, పెద్దయ్య, మల్లేశ్, యాదయ్య, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, నారాయణగౌడ్, నాగభూషణం, వెంకట్‌రెడ్డి, సుంకరి జంగయ్య, మల్లేశ్‌గౌడ్, శంకరయ్య, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్,జి.శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్, యాదయ్యగౌడ్,వెంకటేశ్, బిచ్యానాయక్, సుమన్, మండ్లీ రాములు, ఉమావతి, ప్రభాకర్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనగట్టు ఆలయంలో శివపార్వతుల కల్యాణం

చేవెళ్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, కొనగట్టు మలికార్జునస్వామి ఆలయం. బ్రహ్మగిరి క్షేత్రాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను కనుల పండువగా జరుపుకున్నారు. అయ్యప్ప ఆలయం, హనుమాన్ ఆలయాల్లో భక్తులు కిక్కిరిశారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. కాగా బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అలాగే శివాలయం, కొనగట్టు ఆలయాల్లో శివపార్వతుల పరిణయోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరుడు, శివపార్వతులకు వేర్వురుగా కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. స్వామి వారి కాల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలొచ్చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నరేందర్, ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, పూజారులు అనంతచార్యులు, వాసుదేవాచార్యులు, శ్రీపాద్, శ్రీకాంతచారి, కన్నా, వైభవ్, కొనగట్టు శివాలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం, ప్రధాన పూజారి సురేష్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు ఎం.బాల్‌రాజ్, ఎం.విజయలక్ష్మి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ ఎం.మాలతి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజఆగిరెడ్డి, సీనియర్ నాయకులు రమణారెడ్డి, కృష్ణరెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరి, భోజిరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


కొనగట్టు ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు, పెళ్లి పెద్దలు


బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


చేవెళ్లలోని కొనగట్టు శివాలయం వద్ద భక్తుల సందడి


కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన గోవర్ధన్‌గౌడ్‌తో సీఐ, ఎస్‌ఐ

సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత

కొత్తూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పరిధి శివనగర్‌లో వెలసిన శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి ఉదారతను చాటుకున్నారు ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జె.గోవర్ధన్‌గౌడ్. ఆలయాల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని గోవర్ధన్‌గౌడ్ పేర్కొన్నారు. గోవర్ధన్‌గౌడ్‌ను స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్సై మురళీగౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌కు స్పీకర్ సన్మానం


ఎండీ హఫీజ్‌ను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారం పతకాన్ని సాధించిన ఉమ్మ డి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ హఫీజ్‌ను అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభినందించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హఫీజ్ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయిలో సాధించిన బంగారం పతకం, ప్రశంసాపత్రాన్ని ఆయనకు చూపించగా.. స్పీకర్ ప్రశంసించారు. ఈ వయసులోనూ అథ్లెటిక్స్‌లో హఫీజ్ రాణించడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ వెంకటేష్, రాంచంద్రారెడ్డి, ఎండీ తన్వర్ అలీ, బషీర్, మతీన్, మాజీద్, రాజశేఖర్‌రెడ్డి, మోముల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి పనిచేయాలి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి పునర్వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. మొయినాబాద్ మండల బీఆర్ఎస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దారెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డిలు బుధవారం నగరంలో సబితారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతంపై వారితో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఇప్పటికే బలంగా ఉందని, గత ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే స్థానాన్ని కైవశం చేసుకున్నామని గుర్తు చేశారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో పార్టీని ప్రజల్లో బలంగా నిలిపేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని సబితారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరి, ఎం.రవి, కృష్ణారెడ్డి, మండల లీగల్‌సెల్ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, యువజన విభాగం నాయకుడు అరవింద్, మల్లేష్, పరమేశ్, షాబాద్ ప్రవీన్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు


మహేశ్వరం : రాజరాజేశ్వరాలయంలో శివుడికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


శంకర్‌పల్లి : చందిప్ప మరకత శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య


కొత్తూర్ : కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో దర్శనానికి తరలివచ్చిన భక్తులు


యాచారం : నందివనపర్తిలోని సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి దంపతులు

హరహర మహాదేవ.. శంభో శంకర

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తారు. పూజారులు యాజ్ఞయాగాదులు నిర్వహించారు. అభిషేకాలు, హోమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కాగా, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.


యాచారం : నందివనపర్తిలోని నందీశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి


కందుకూరు : శివాలయంలో శివపార్వతుల కల్యాణం


చౌదరిగూడ : కొందుర్గు ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు


శంషాబాద్ రూరల్ : అమ్మపల్లి సీతారామ చంద్రస్వామి ఆలయంలో భక్తుల పూజలు


కడ్తాల్ : మైసిగండి శివాలయంలో అభిషేకం చేస్తున్న ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతూ


తలకొండపల్లి : మల్లప్పగుట్టపై శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్సీ పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి / సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు


షాద్‌నగర్ అర్బన్ : వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా


చౌదరిగూడ : రావిర్యాల సోమలింగేశ్వరాలయంలో భక్తుల పూజలు


ఆమనగల్లు : కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, గోలి శ్రీనివాస్ రెడ్డి తదితరులు


షాబాద్ : ముద్దెంగూడ శివాలయం వద్ద పూజలో గ్రామస్థులు


మంచాల : రాచకొండలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి


శంషాబాద్ : [illegible] దేవాలయం వద్ద భక్తుల సందడి


షాద్‌నగర్‌రూరల్ : రామేశ్వరం రామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి దంపతుల పూజలు


నందిగామ : లింగంమూర్తి శివాలయంలో భక్తులు


కేశంపేట : కాకునూర్ మహాలింగేశ్వరస్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు


ఇబ్రహీంపట్నం : దండుమైలారంలో శివుడికి అభిషేకం

పేద విద్యార్థులకు అండగా ఉంటా

- జన్మదిన వేడుకల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల/మొయినాబాద్ రూరల్ : విశ్వేశ్వర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం, శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్‌రావు తదితరులు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/శంకర్‌పల్లి/కందుకూరు/మహేశ్వరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సాయమందిస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రత్నం ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఎంపీని శాలువాలు, పూలమాలలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మెరుగైన ప్రతిభ చాటిన 60 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున చెక్కులను ఎంపీ అందజేశారు. అలాగే చేవెళ్లలో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల నిర్వహణకు రూ. 2 లక్షలు చెక్కు అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాశ్, ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, కుంచం శ్రీనివాస్ గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు జి. వెంకట్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వాసుదేవ్‌ఖాన్న, శ్రీనివాస్, కె. వెంకట్‌రెడ్డి, మహేశ్, కృష్ణారెడ్డి, మధుకర్‌రెడ్డి, అశోక్, సుధాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి విశ్వేశ్వర్‌రెడ్డి అని బీజేపీ ఎస్సీమోర్చా రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు అంతంగారి నర్సింగ్‌రావు అన్నారు. ఎంపీ జన్మదిన వేడుకల్లో మొయినాబాద్ బీజేపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొని ఎంపీతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, చిలుకూరు గరుగురాజు ముదిరాజ్, అజీజ్‌నగర్ గ్రామ అధ్యక్షుడు సంతోష్‌చారి పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రత్నం శంకర్‌పల్లిలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. 10 మంది విద్యార్థులకు రూ.2500 చొప్పున చెక్కులు అందజేశారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మాశెట్టి పాండు, రాములు, వీరేందర్, ప్రవీణ్, లోకేష్, వెంకట్, ఆంజనేయులు, రాంరెడ్డి, హరిగౌడ్ తదితరులు ఉన్నారు. అలాగే మహేశ్వరంలో బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు చెక్కులు అందజేశారు. బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మిద్దె సుదర్శన్‌రెడ్డి, కాసాని వెంకటేష్‌గౌడ్, దిశ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, ఆయిల్ల యాదయ్యగౌడ్, దేశ్యానాయక్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, మంద పాండు, శ్రవణ్, అంజిరెడ్డి, తదితరులున్నారు. అలాగే విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కందుకూరులోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలో మొత్తం 7మంది విద్యార్థులకు చెక్కులను అందజేశారు. అందెల శ్రీరాములుయాదవ్‌తో పాటు పార్టీ మహేశ్వరం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎన్.నర్సింహారెడ్డి, మంద పాండు, ఎగ్గిడి సత్తయ్య, మండల నాయకులు ఎస్.భూమిరెడ్డి, అనేగౌని రవీందర్‌గౌడ్, కె.చెన్నారెడ్డి, చిలుకల రఘునందన్, ఎస్.దయాకర్‌రెడ్డి, డిల్లీ అనీల్, నరసింహ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ నిర్ణయాలు ఆలస్యం కావడంతో ఇతరాత్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ధరణి అమల్లోకి వచ్చిన తరువాత రెవెన్యూ సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి. వీటి పరిష్కారం విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కలెక్టర్లు మారినప్పుడల్లా ఫిర్యాదులకు సంబంధించిన ఫార్మాట్లు మారిపోతున్నాయి. దీనివల్ల కూడా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, ఇతర అన్ని శాఖల అధికారులు ఆ రోజు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. కానీ, ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా సజావుగా సాగడం లేదు. సి.నారాయణ రెడ్డి కలెక్టర్‌గా వచ్చిన తరువాత ప్రజా దర్బార్‌కు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా అడిగి తెలుసుకుంటున్నారు. ఆ తరువాత రెవెన్యూ అధికారులు సరిగా స్పందించడం లేదు. ఇటీవల జరిగిన ప్రజాదర్బార్‌కు హాజరైన ఒకరు తాము ఈ సమస్యపై కొన్ని నెలలుగా తిరుగుతున్నామని వాపోయారు. మీ ఫైల్ ఫలానా సెక్షన్‌లో ఉందని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. అయితే అప్పటికే సమాచారం తెలుసుకున్న ఫిర్యాదుదారుడు 'మేడమ్... ఆ ఫైల్ అక్కడ లేదు.. మీ దగ్గరే పెండింగ్‌లో ఉంది.. చాలారోజుల కిందటే పంపారట అని చెప్పారు. కానీ, దానిపై ఇంత వరకు కదలిక లేదు. ఇలా పని ఒత్తిడా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయో కానీ అదనపు జేసీ పేషీలో ఫైళ్లు మాత్రం కదలడం లేదు.

గోడు వినేదెవరూ?

అదనపు జేసీ పేషీలో దాదాపు నాలుగువేలకుపైగానే ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ రెవెన్యూ అధికారి వద్ద లేని విధంగా ఇంత

అదనపు కలెక్టర్ పోస్టు భర్తీ చేయరా?

పెద్ద స్థాయిలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండడంతో బాధితులు ప్రతి రోజూ కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడు వెళ్లబోసుకునేయత్నం చేస్తున్నారు. వివిధ రెవెన్యూ సమస్యలపై ప్రతీ రోజు జిల్లా నుంచి వస్తున్న అనేక మంది రోజంతా పడిగాపులు కాసినా ఒక్కోసారి దర్శనభాగ్యం కూడా కలగడం లేదు. ఇటీవల ఓ బాధితుడి తరపున వచ్చిన లాయర్ ఏకంగా నాలుగు గంటల పాటు వేచి ఉండి తిట్టుకొని వెళ్లిపోయారు. ఇక మీడియాకు కూడా ఆమె పెద్దగా అందుబాటులో ఉండరు. ఏదైనా సమాచారం కోసం జర్నలిస్టులు అపాయిమెంట్లు అడిగినా.. ఫోన్ చేసినా కూడా స్పందించరు. అదనపు కలెక్టర్ పేషీలో సిబ్బంది ఆకాశం నుంచి ఊడిపడినట్లే వ్యవహరిస్తున్నారని కొందరు వాపోతున్నారు. అనుభం లేని సిబ్బందిని పేషీలో పెట్టుకోవడంతో వచ్చిన వారికి వారు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. బాధితులు స్లిప్‌పై రాసిస్తే ఆ స్లిప్ అదనపు కలెక్టర్ టేబుల్ వద్దకు రెండు, మూడు గంటలకు కూడా వెళ్లదు. దారీతెన్నూలేని ప్రాంతంలో ఉన్న కలెక్టరేట్‌కు ఏదో వాహనం పట్టుకుని వచ్చిన ఫిర్యాదుదారులు సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్న సంఘటనలు కోకొల్లలు. రెవెన్యూ వ్యవహారాలు చూసే కొన్ని సెక్షన్లు కూడా ఇలానే కొందరు సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ఆఫీసుకు వచ్చే సమయం ముందుగా తెలుసుకుని ఆయన ఉన్నంత సేపు ఉండి వెళ్లిపోతున్నారు. కీలకమైన రెవెన్యూ విభాగంలో సెక్షన్ అధికారి ఒకరు విధులకు అంతంతమాత్రంగానే హాజరవుతారు. గతంలో ఓ మంత్రి పేషీలో పనిచేసిన ఆయనకు ప్రస్తుతం ఉద్యోగం అంతగా నచ్చడం లేదని తెలుస్తోంది. ఇక ఆయన కింద పనిచేసే సిబ్బంది కూడా తీరు కూడా అలానే ఉంది.

స్పీకర్‌కు ఘన స్వాగతం

తలకొండపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు తలకొండపల్లి మండలంలో ఘన స్వాగతం లభించింది. మల్లప్పగుట్ట మల్లిఖార్జున స్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలకు హాజరైన స్పీకర్‌కు ఆమనగల్లు మండలం విఠాయిపల్లి వద్ద కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బ్యాండ్ వాయిద్యాలతో ఎదురేగి స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని స్పీకర్‌ను ఎమ్మెల్యే కోరారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు మండ్లీ రాములు, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు వినతి

తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామ జేఏసీ నాయకులు స్పీకర్‌ను కోరారు. ఈమేరకు జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. 11 రెవెన్యూ గ్రామాలతో గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు అభ్యర్థించారు. సమీప గ్రామ పంచాయతీల తీర్మాన లేఖలను కూడా ఈ స్పీకర్‌కు అందజేశారు. గట్టిప్పలపల్లి గ్రామస్థుల విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ప్రసాద్‌కుమార్ తెలిపారు.

ఆలయానికి సౌండ్ సిస్టమ్ బహూకరణ

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 6వ వార్డులో గల శివమారుతి దేవాలయానికి సాయిబాబా కాలనీకి చెందిన శివ అనే భక్తుడు సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. మహా శివరాత్రిని పురష్కరించుకుని తన తండ్రి దివంగత నర్సింహులు నిర్మించిన ఆలయానికి సౌండ్ సిస్టమ్‌ను ఇచ్చి, తన భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు అంజనేయులుగౌడ్, వెంకన్నబాబు, రామకృష్ణ యాదవ్, వెంకటయ్య, కాంత్రికుమార్, మాధవరెడ్డి, బెన్నూరి చంద్రయ్య, జె. శ్రీనివాసులు, రమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్ని శివను అభినందించారు.



క్రైం కార్నర్

బైక్ ఢీకొని మహిళ మృతి

ఆమనగల్లు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని కాటన్ మిల్ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన జగదీశ్ కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. ఈక్రమంలో ఆమనగల్లు పట్టణ సమీపంలోని హైదరాబాద్ రోడ్డులో కారుకు పెట్టే చార్జింగ్ పాయింట్ వద్ద వాహనం నిలిపారు. ఆ తరువాత కారులో ఉన్న జగదీశ్ భార్య జయమ్మ(67) కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు దాటుతుండగా ఎదురుగా హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తున్న ఎండీ ఆసిమ్ అనే వ్యక్తి ఆమెను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త జగదీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

చౌదరిగూడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. పర్వతాపూర్ గ్రామానికి చెందిన తోలుకట్ట మల్లేష్(38)కు అదే గ్రామానికి చెందిన చిట్టెమ్మతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా, భార్యా భర్తలు తరచూ గొడవపడేవారు. ఈక్రమంలో షాద్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. భార్యభర్తల మధ్య గొడవలతో పాటు మనస్పర్ధలు తీవ్రమవడంతో చిట్టెమ్మ సోదరులైన శ్రీనివాస్, అమరేందర్‌లకు ఈనెల 25న విషయం తెలియడంతో షాద్‌నగర్‌కు వచ్చి ముగ్గురు కలిసి అద్దె ఉంటున్న గదిలో మల్లేష్‌ను తీవ్రంగా కొట్టారు. నువ్వు చనిపోతే మాకు బాగుంటుందని తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లేష్ 25న సాయంత్రం షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి చేరుకొని అప్పటికే వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లేష్ బుధవారం మృతి చెందాడు. ఈమేరకు అతడి తల్లి సత్యమ్మ పోలీలసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న రెండు బైక్‌లను కారు వెనకాల నుంచి ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారు నార్సింగ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మోకిల ఎస్సై కోటేశ్వర్‌రావు కథనం మేరకు.. ప్రొద్దటూరు గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి తన మిత్రులు మహేందర్ రెడ్డి, మల్లేషం, సుధాకర్‌రెడ్డిలతో కలిసి కారులో బుధవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. మోకిలలోని విజేత సూపర్ మార్కెట్ సమీపంలో కారు ముందు వెళుతున్న రెండు బైక్‌లను అతివేగంగా ఢీకొంది. ద్విచక్రవాహనదారులు శ్రీనివాస్, చంద్రసింగ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో నార్సింగ్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, వారిద్దరు అపస్మారక స్థితిలో ఉన్నారని, కారు నడుపుతున్న సురేందర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాకపోగా.. అతడు పరారీలో ఉన్నారని చెప్పారు. కారులోని మిగతా వారికి సైతం గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.